ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



తమిళనాడు
TAMILNADU

శుక్రవారం 15 ఆగస్టు 2025

- జార్జ్‌కోటపై సీఎం పతాకావిష్కరణ
- మెరీనాలో ఐదంచెల భద్రత
- విమానాశ్రయాల్లో ఏడంచెలు
- రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మంది పోలీసులతో పహారా



విద్యుద్దీప కాంతుల్లో జీసీసీ ప్రధాన కార్యాలయ భవనం

జెండా పండుగకు సర్వం సిద్ధం

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పందాగస్టు వేడుకలకు రాష్ట్రం సిద్ధమైంది. దేశ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు అవకాశం లేకుండా రాష్ట్ర వ్యాప్తంగా లక్ష మందికి పైగా పోలీసులు గత రెండ్రోజుల నుంచి రేయింబవళ్లు కాపలా కాస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, సంస్థలు, విద్యాలయాలు జెండా పండుగ ఘనంగా నిర్వహించుకునేందుకు భారీస్థాయిలో ఏర్పాట్లు చేసుకున్నాయి. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా లక్షమందితో భద్రత ఏర్పాటు చేసినట్లు పోలీస్ శాఖ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సచివాలయ ప్రాంగణం పరిసర ప్రాంతాలను అందంగా తీర్చిదిద్దారు. సెయింట్ జార్జ్‌కోటలో పంద్రాగస్టు వేడుకలు జరుగనుండగా, అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ఆయా సంస్థల కార్యాలయాల్లో కూడా ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌శాఖ సమస్యాత్మక ప్రాంతాలు, ఆలయాలు, చర్చిలు, మసీదులు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, విమానాశ్రయాలు, భారీ వంతెనలు, డ్యామ్‌ల వద్ద పటిష్టమైన భద్రతా చేపట్టింది. హింసాత్మక ఘటనలకు అవకాశం ఇవ్వకుండా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా పలువురిని అరెస్టు చేసింది. అంతేగాక ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసింది.



సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ బలగాల తనిఖీ

జార్జ్‌కోటపై...

స్వాతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని సెయింట్ జార్జ్ కోట వద్ద పోలీస్ శాఖ ఐదంచెల భద్రత ఏర్పాటు చేసింది. సుమారు తొమ్మిదివేలమందికి పైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సెయింట్ జార్జికోటపై జాతీయపతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ వేడుకలకు గత పదిహేను రోజులుగా సీనియర్ పోలీసు ఉన్నతాధికారులు భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. వారం రోజులుగా సచివాలయాన్ని సందర్శించేందుకు వచ్చేవారిపై డేగకన్నుతో నిఘా వేశారు. కామరాజర్‌సాలైలో వెళ్లే వాహనాలను క్రమబద్ధీకరించారు. శుక్రవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ఆ మార్గంలో వాహనాల రాకపోకలపై నిషేధం అమలు చేస్తున్నారు.



సెయింట్ జార్జికోట ప్రాంగణంలో వీఐపీల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక



వీఐపీలకు ప్రత్యేక వేదిక...

ముందుగా శుక్రవారం ఉదయం 8.45 గంటలకు సెయింట్‌జార్జి కోట ప్రవేశద్వారం వద్దకు కాన్వాయ్‌తో వెళ్లే ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం స్వాగతం పలుకుతారు. కోట బురుజు వద్ద జాతీయ జెండాను ఆవిష్కరిస్తారు. రాష్ట్ర ప్రజానీకాన్ని ఉద్దేశించి సీఎం స్టాలిన్ ప్రసంగించనున్నారు. ఈ వేడుకలకు హాజరయ్యే హైకోర్టు న్యాయమూర్తులు, పోలీసు ఉన్నతాధికారులు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాష్ట్ర మంత్రులు తదితరుల కోసం వేర్వేరుగా సెయింట్ జార్జ్‌కోటకి ఎదురుగా రోడ్డుకు ఆవలి వైపు ప్రత్యేకగ్యాలరీలు నిర్మించారు.



ఫేస్ పెయింటింగ్‌తో విద్యార్థినుల సందడి ..

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఆహ్వానిస్తూ జార్జిటౌన్‌లోని శ్రీకన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల విద్యార్థినులు మూడు రంగులను ముఖాలపై చిత్రించుకుని తమ దేశభక్తిని చాటుకున్నారు.

15 మంది పోలీసులకు సీఎం పతకాలు..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన 15 మంది పోలీసులకు ముఖ్యమంత్రి సేవా పతకాలను ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం మధ్యాహ్నం పతకాలు అందుకోబోయే పోలీసు ఉన్నతాధికారుల వివరాలను విడుదల చేసింది. మొత్తం ఎనిమిది గ్రాముల బంగారంతో రూపొందించిన ఈ పతకంతో పాటు రూ.25 వేల నగదు పురస్కారాన్ని కూడా వారికి అందిస్తారని ప్రభుత్వం ఆ ప్రకటనలో పేర్కొంది.



కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షిస్తున్న పోలీసులు



మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

- ఉదయం అల్పాహారం
- చర్మవ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చికిత్స
- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

పారిశుధ్య కార్మికులకు ఆరు వరాలు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రెండు వారాలపాటు నిరవధిక సమ్మెలో పాల్గొని, బుధవారం అర్ధరాత్రి అరెస్టయిన పారిశుధ్య కార్మికుల డిమాండ్ల మేరకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ వారికి ఆరు వరాలు ప్రకటించారు. గురువారం ఉదయం సచివాలయంలో ఆయన అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. అయితే పారిశుధ్య పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించకూడదని, ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలన్న ప్రధాన డిమాండ్లపై మంత్రి వర్గ సమావేశం నిర్ణయం తీసుకోకపోవడం గమనార్హం. మంత్రివర్గ సమావేశం అనంతరం ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు మీడియాతో మాట్లాడుతూ.. మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం పారిశుధ్య కార్మికుల కోసం అమలు చేయనున్న కొత్త పథకాలను వివరించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పారిశుధ్య కార్మికుల సంక్షేమం కోసం వరాలను ప్రకటించారని ఆయన తెలిపారు.

మూడేళ్లలో స్వస్థలాల్లో ఇళ్లు

వచ్చే మూడేళ్లలో పారిశుధ్య కార్మికులకు వారుంటున్న ప్రాంతాలకు చేరువగానే పారిశుధ్య కార్మికుల సంక్షేమ సంస్థ, రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ, రాష్ట్ర నగర శివారు ప్రాంతాల అభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పక్కా ఇళ్లు నిర్మిస్తారు. చెన్నై సహా ప్రముఖ నగరాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఇళ్ళను నిర్మించి ఇస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో నివశించే పారిశుధ్య కార్మికులకు 'కలైంజర్ స్వప్న నివాసం' పథకం కింద ఇళ్ళకేటాయింపులో ప్రాధాన్యత ఇస్తారు.

- **ప్రత్యేక చికిత్స :** పారిశుధ్య కార్మికులు రహదారుల్లో చెత్తాచెదారం తొలగించడం వల్ల వారికి శ్వాస సంబంధిత సమస్యలు, చర్మ వ్యాధులు వచ్చే అవకాశాలున్నాయి. కార్మికులకు ప్రాథమిక స్థాయిలోనే వైద్య పరీక్షలు నిర్వహించి, శ్వాస సంబంధిత రోగాలు రాకుండా అడ్డుకునేందుకు, చర్మవ్యాధులు సోకకుండా ప్రత్యేక చికిత్సా విధానాలను అమలు చేస్తారు.
- **విధినిర్వహణలో మృతి చెందితే రూ.10లక్షలు :** పారిశుధ్య కార్మికులు విధి నిర్వహణంలో మృతి చెందితే వారి కుటుంబాలకు ఇప్పటి వరకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నారు. పారిశుధ్య కార్మిక సంక్షేమ సంస్థ కూడా రూ.5లక్షల సాయం అందిస్తుంది. ఇకపై విధి నిర్వహణలో పారిశుధ్య కార్మికులు ఎవరైనా మృతి చెందితే వారి కుటుంబానికి రూ.10లక్షల చొప్పున సాయం లభిస్తుంది.
- **స్వయం ఉపాధికి రూ.35 శాతం సబ్సిడీ :** పారిశుధ్య కార్మికులు, వారి కుటుంబీకులు సామాజిక పరంగా ఆర్థికపరంగా అభివృద్ధి చెందటానికి స్వయం ఉపాధి కోసం ఏవైనా పరిశ్రమలు ప్రారంభించదలిస్తే అందుకయ్యే వ్యయంలో రూ.35 శాతాన్ని ప్రభుత్వం సబ్సిడీగా ఇస్తుంది. ఆర్థిక సాయం పొంది పరిశ్రమను స్థాపించేవారు సకాలంలో రుణ వాయిదాలను చెల్లిస్తే వడ్డీ 6 శాతం మినహాయింపు ఇస్తుంది. ఈ పథకానికిగాను ప్రభుత్వం యేటా రూ.10కోట్ల మేర నిధులను కేటాయిస్తుంది.
- **పిల్లలకు విద్యా ఉపకారవేతనాలు:** పారిశుధ్య కార్మికుల పిల్లలు ఏ పాఠశాలలో చదివినా, వారికి ఉన్నత విద్యా రాయితీ మాత్రమే కాకుండా, హాస్టల్ ఖర్చులు, పుస్తకాలకు అయ్యే ఖర్చు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ఆ మేరకు పారిశుధ్య కార్మికుల కోసమే ప్రత్యేకంగా 'ఉన్నత విద్యా ఉపకార వేతన పథకం' అమలు చేస్తుంది.
- **అల్పాహార పథకం :** పారిశుధ్య కార్మికులు వేకువజామునే విధులకు హాజరవుతుండటంతో ఆ సమయంలో వారి ఆకలి తీర్చేందుకు స్థానిక సంస్థల ద్వారా ఉచిత అల్పాహారం సరఫరా చేయనున్నారు. ఈ అల్పాహార పథకాన్ని రాజధాని నగరంలో అమలు చేసిన తర్వాత దశాలవారీగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింపజేస్తారు.

థియేటర్ల వద్ద 'కూలీ' సందడి

- రజనీ ఫ్యాన్స్ సంబరాలు
- సినిమా చూసేందుకు వచ్చిన సినీ నటులు



సినిమా చూసేందుకు సతీమణితో కలిసి వచ్చిన శివకార్తికేయన్ - అనిరుధ్ - లోకేష్ కనకరాజ్, ఐశ్వర్య, ధనుష్

అడయార్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రం గురువారం ప్రపంచ వ్యాప్తంగా విడుదలైంది. దీంతో రజనీ అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఈ సినిమా విడుదలను పురస్కరించుకుని తొలి ఆట చూసేందుకు థియేటర్ల వద్దకు అభిమానులు భారీగా తరలివచ్చారు. పలు థియేటర్ల వద్ద రజనీ ఫ్యాన్స్ సంబరాలు జరుపుకున్నారు. థియేటర్ల వద్ద భారీ కటౌట్లు, బ్యానర్లు కట్టి, బాణసంచా పేల్చి హంగామా చేశారు. మరికొన్ని థియేటర్లలో మంగళవాయిద్యాలు వాయిస్తూ నృత్యం చేశారు. ఈ సినిమా విడుదలకు ముందే అన్ని థియేటర్లలో టిక్కెట్స్ బుక్ అయిపోయాయి. అయినప్పటికీ ఆయన అభిమానులు థియేటర్‌లో కౌంటర్ల వద్ద టిక్కెట్ల కోసం బారులు తీరారు. మరోవైపు ఈ సినిమా చూసేందుకు పలువురు సినీ ప్రముఖులు కూడా వచ్చారు. రజనీకాంత్ వీరాభిమాని అయిన హీరో శివకార్తికేయన్ తన భార్యతో కలిసి రాయపేటలోని సత్యం థియేటర్‌లో సినిమా చూశారు. అలాగే హీరో ధనుష్, ఈయన కుమారుడు యాత్ర, రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య, సన్‌రైజర్స్ హైదరబాద్ జట్టు సహ యజమాని కావ్య మారన్, హీరోయిన్ శృతిహాసన్ కోయంబేడులోని రోహిణి థియేటర్‌లో తొలి ఆట తిలకించారు. అదేవిధంగా 'కూలీ' చిత్ర దర్శకుడు లోకేష్ కనకరాజ్, సంగీత దర్శకుడు అనిరుథ్, రజనీకాంత్ సతీమణి లతా రజనీకాంత్, అనిరుధ్ తండ్రి రవిచందర్ క్రోంపేటలోని వెట్రి థియేటర్‌లో సినిమా చూశారు.



రోహిణి థియేటర్ వద్ద అభిమానుల సందడి

ఇప్పటికీ మాసిపోని విభజన గాయాలు

- రాష్ట్రంలో పాలకుల అండతోనే మాదకద్రవ్యాల వాడకం
- గవర్నర్ ఆర్‌ఎన్ రవి

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతియేటా ఆగస్టు 14న భారతదేశం తన ఐదువేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్రలో ఎన్నడూ జరగని ఓ ఘటనను బాధతో గుర్తు చేసుకుంటోందని, భారతదేశం రెండు ముక్కలైన సందర్భంగా ఏర్పడిన గాయాలు ఇంకా మానలేదని గవర్నర్ ఆర్ఎన్ రవి పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్‌భవన్ ఎక్స్ పేజీలో ఆయన ఓ సందేశం వెలువరించారు. ముస్లింలకు ప్రత్యేక దేశం కావాలంటూ ముస్లింలీగ్ హింసకు పాల్పడిందన్నారు. ముస్లింలీగ్ చేత 'కాఫీర్లు' గా ముద్రవేయబడిన లక్షలాదిమంది తమ పూర్వీకులు వేల సంవత్సరాలుగా నివసించిన భూమి నుండి మరో ప్రాంతానికి వలసపోయారని, ఆ నాటి విభజన గాయాలు ఇంకా మానలేదన్నారు. ముసుగు కప్పుకుని ఉన్న ఇలాంటి దుష్టశక్తులు ఇప్పటికీ పెరుగుతున్నందున దేశం ఈ రోజు (ఆగస్టు 14)ను లోతైన భావోద్వేగంతో గుర్తుంచుకుంటోందన్నారు. ఆ దుష్టశక్తులు అసత్యాలతో, మోసపూరిత చర్యలతో దేశం యొక్క ఆత్మవిశ్వాసాన్ని విచ్ఛిన్నం చేయడానికి, ప్రజల మనోధైర్యాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. నవ్యభారతం పటిష్టభారతం అనే సంకల్పం దిశగా భారతావని పురోగమిస్తున్న ఈ తరుణంలో ఆ దుష్టశక్తులను ఎదురించేందుకు ప్రతి భారతీయుడూ ప్రత్యేకించి తమిళనాడుకు చెందిన తన సోదరసోదరీమణులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని గవర్నర్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పాలకుల అండదండలతోనే మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందని, వీటికి తోడు మహిళలపై లైంగిక వేధింపులు తదితర నేరాలు కూడా పెరిగాయని గవర్నర్ ఆరోపించారు. ఇలాంటి లైంగికపరమైన నేరాలను ఉక్కుపాదంతో అణచివేయాలన్నారు. పాలకుల ఆశీస్సులతోనే రాష్ట్రంలో మాదక ద్రవ్యాల పంపిణీ జరుగుతోందని, గంజాయితో సహా రసాయన మాదక ద్రవ్యాల వాడకమూ పెరుగుతోందని ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్‌కు హానికలిగించేవారిపై నేటి యువత సాయంతో కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.



19 వరకు మోస్తరు వర్షాలు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో ఈ నెల 19వ తేది వరకు మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. పశ్చిమ మధ్య, దానిని అనుకుని ఉన్న వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రాబోయే 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశముంది. ఇది ఉత్తర ఆంధ్ర ప్రదేశ్, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటే అవకాశముంది. అదే సమయంలో తమిళనాడు, దక్షిణాది రాష్ట్రాలపై ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతోంది. ఈ కారణంగా రాష్ట్రంలోని ఒకటి, రెండు ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో ఈ నెల 19వ తేది వరకు ఉరుములు, మెరుపులు, గంటకు 50 కి.మీ ఈదురుగాలులతో కూడిన మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో ఆకాశం మేఘావృతంగా ఉంటూ కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలియజేసింది.

నగరంలో డబుల్‌డెక్కర్ పరుగులు



చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో మళ్లీ డబుల్ డెక్కర్ బస్సుల సంచారం ప్రారంభం కాబోతోంది. ఇందులో భాగంగా గురువారం ఉదయం పలుచోట్ల డబుల్ డెక్కర్ బస్సులతో ట్రయల్ రన్ వేశారు. ఈ డబుల్ డెక్కర్ బస్సులను నడిపేందుకు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు మహానగర రవాణా సంస్థ ఈ బస్సులను ప్రయోగాత్మకంగా నడిపింది. నగరంలోని కోయంబేడు, సెంట్రల్ స్టేషన్, బ్రాడ్వే, మాధవరం, పూందమల్లి, తాంబరం, ఆవడి ప్రాంతాల మీదుగా డబుల్ డెక్కర్ బస్సుల ట్రయల్ రన్ నిర్వహించారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ప్రారంభించిన ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను తలపించేలా పై అంతస్థుతో, ఎరుపురంగులో ఉన్న ఈ బస్సుల సంచారాన్ని చూసి నగరవాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. రాష్ట్ర రాజధాని నగరం చెన్నైతో పాటు కోల్‌కతా, ఢిల్లీ, ముంబయి నగరాల్లో డబుల్ డెక్కర్ బస్సులు 1970 నుంచే నడిచాయి. ప్రస్తుతం మళ్లీ కొత్త హంగులతో తయారైన 20 డబుల్ డెక్కర్ సిటీ బస్సులను నగరవాసులకు వింత అనుభూతిని కలిగించనున్నాయి.

సమాచార ధ్వని

సినిమాటోగ్రాఫర్, డిజైనర్ శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు సినిమాటోగ్రాఫర్ డిజైనర్, ఫోర్క్ లిఫ్ట్ ఆపరేటర్ తదితర శిక్షణలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు థాడ్కో విడుదల చేసిన ప్రకటనలో... శిక్షణకు సంబంధించిన మరిన్ని వివరాలు www.tahdco.com అనే వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని సూచించింది. శిక్షణా కాలంలో భోజనం, బస ఖర్చులు థాట్కో భరిస్తుందని ప్రకటనలో తెలిపింది.

విద్యార్థులకు ఏఐపై శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఐబీఎం సంస్థ విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), మెషీన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ తదితరాలపై ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇవ్వనుంది. అంతర్జాతీయ సాంకేతిక సంస్థ ఐబీఎం 'స్కిల్ బిల్డ్ అకాడమీ' ద్వారా బీఈ, బీటెక్, ఎంసీఏ చదువుతున్న విద్యార్థులకు ఆరు వారాల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ అందిస్తోంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఏఐసీటీఈ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

'తమిళ్ సెమ్మల్' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తమిళ భాషాభివృద్ధికి కృషిచేసిన సంస్థలు, వ్యక్తులను ప్రోత్సహించేలా తమిళ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'తమిళ్ సెమ్మల్' పురస్కారం, రూ.25వేల నగదు అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు, కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలోని తమిళ అభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్ ద్వారా, శాఖ వెబ్‌సైట్ ద్వారా సెప్టెంబరు 30వ తేదిలోగా దరఖాస్తు చేసుకోవచ్చని తమిళ అభివృద్ధి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

రేపటి నుంచి దీపావళి రైళ్ల రిజర్వేషన్ ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): దీపావళికి ముందస్తు రిజర్వేషన్ శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఈ ఏడాది దీపావళి పండుగ అక్టోబరు 20వ తేది జరుపుకోనున్నారు. ఈ ఏడాది దీపావళి పండుగ సోమవారం రానుంది. దీంతో, శని, ఆది, సోమవారం మూడు రోజులు వరుస సెలవులు కావడంతో నగరాల నుంచి సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ఆ ప్రకారం, అక్టోబరు 17వ తేది ప్రయాణానికి శనివారం (ఈ నెల 16వ తేది), 18వ తేది ప్రయాణానికి ఆదివారం రిజర్వేషన్ ప్రారంభం కానుందని అధికారులు తెలిపారు.

నేడు మద్యం దుకాణాలకు సెలవు

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా టాస్మాక్ మద్యం దుకాణాలకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మీ సిద్ధార్థ్ శుక్రవారం సెలవు ప్రకటించారు. నగరంలోని మద్యం దుకాణాలు, బార్లు తప్పనిసరిగా మూసివేయాలని ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఉత్తర్వులు ఉల్లంఘించి మద్యం విక్రయాలు జరిపితే సంబంధిత టాస్మాక్ దుకాణాలకు సీలు వేయడంతో పాటు చట్టపరమైన చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

రెండు కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలకు పురస్కారాలు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి పురస్కారాలు అందుకోనున్న మున్సిపాలిటీల జాబితాలో ఆవడి, నామక్కల్ కార్పొరేషన్లు, రామేశ్వరం, రాజపాళయం, పెరంబలూరు మున్సిపాలిటీలున్నాయి. తొలి రెండు స్థానాల్లో నిలిచిన కార్పొరేషన్లకు తలా రూ.50 లక్షలు, రూ.30, మూడు స్థానాల్లో నిలిచిన మున్సిపాలిటీలకు తలా రూ.30 లక్షలు, రూ.20 లక్షలు, రూ.10 లక్షల చెక్కులను ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేయనున్నట్లు సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.


1 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26) ధాన్యం కొనుగోళ్లకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిందని, ఆ ప్రకారం, సెప్టెంబరు 1వ తేది నుంచి వరి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు ఆహార శాఖ మంత్రి ఆర్.చక్రపాణి తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... 2024-25వ సంవత్సరంలో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 46.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 2025-26వ సంవత్సరంలో సన్న రకం క్వింటాలుకు రూ.2,545, పెద్ద రకం క్వింటాలుకు రూ.2.500 అందజేయనున్నట్లు తెలిపారు. 51 ఏళ్ల డీఎంకే పాలనలో ఇప్పటివరకు 1.83 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు రూ.40,440.21 కోట్లు ఇచ్చామని,అందులో రాష్ట్రప్రభుత్వ ప్రోత్సాహకంగా రూ.1,816.46 కోట్లు చెల్లించినట్టు మంత్రి చక్రపాణి తెలిపారు.

రూ.78.59 కోట్లతో పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 20 పర్యాటక ప్రాంతాలను రూ.78.59 కోట్లతో అభివృద్ధి చేసినట్లు పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పలు చర్యలు చేపట్టామన్నారు. ప్రాచీన పుంపుహార్ నగరాన్ని రూ.21.98 కోట్లతో పర్యాటకప్రాంతంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కన్నియాకుమారి జిల్లా సిత్తార్ నదీ తీరాన్ని రూ.3.11 కోట్లు, నీలగిరి జిల్లా ఊటీ బోట్ హౌస్‌ను రూ.2.85 కోట్లు, చెంగల్పట్టు జిల్లా ముదలియార్‌కుప్పంను రూ.1.16 కోట్లు, నామక్కల్ జిల్లా కొల్లిమలైను రూ.1.87 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో వారాహి అమ్మవారు

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఆడి పంచమి తిథిని పురస్కరించుకుని వారాహి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెన్‌కాశి జిల్లా శంకరన్ కోవిల్ సమీపంలోని కల పాక్కుళం రహదారిలో మహాశక్తి వారాహి అమ్మవారి ఆలయం రాజులకాలంలో నిర్మించారు. ఈ ఆలయంలో పంచమి తిథి సందర్భంగా ప్రతీ ఏటా వైభవంగా నిర్వహించే పూజల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల భక్తులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో గురువారం తెల్లవారుజాము నుండే ఆలయ ప్రధాన అర్చకులు శక్తివేల్ నేతృత్వంలో పరివార దేవతలకు అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయండి

- రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నేత హసీనా సయ్యద్


తూత్తుకుడిలో మహిళా కాంగ్రెస్ నూతన కార్యవర్గ సభ్యులతో హసీనా సయ్యద్

టి.నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లును ఆమోదించకుండా నిర్లక్ష్యధోరణిని ప్రదర్శిస్తోందని, ఏ మాత్రం జాప్యం వహించకుండా ఆ బిల్లును ఆమోదించాలని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు హసీనా సయ్యద్ డిమాండ్ చేశారు. తూత్తుకుడిలో గురువారం జరిగిన కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా శాఖకు కొత్తగా నియమితులైన కార్యవర్గ సభ్యులకు ఆమె నియమక పత్రాలు అందజేశారు.. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ మాత్రమే మహిళలకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, అయితే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మాయమాటలతో మోసపుచ్చడం ఆనవాయితీగా పెట్టుకుందని, ఆ కోవలోనే పార్లమెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చి, ఆ బిల్లును ఆమోదించకుండా మహిళలకు తీరని ద్రోహం చేస్తోందని ఆమె ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సానుకూలంగా వ్యవహరిస్తూ నకిలీ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లంటూ లక్షలాదిమంది పేర్లను తొలగించి భారీ స్థాయిలో అక్రమాలకు పాల్పడుతోందని, ఇతర రాష్ట్రాలకు చెందిన ప్రత్యేకించి ఉత్తరాది రాష్ట్రాలకు చెందినవారి పేర్లను ఓటర్ల జాబితాలో చేర్చేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలోను ఉత్తరాదికి చెందిన నకిలీ ఓటర్ల పేర్లను జాబితాలో చేర్చేందుకు ఎన్నికల సంఘం చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ, మహిళా కాంగ్రెస్ కమిటీ సమర్థవంతంగా అడ్డుకుంటాయని ఆమె చెప్పారు.

525 వాహనాలు వేలం వేయనున్న జీసీసీ

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): క్లెయిమ్ చేయని వాహనాలను వేలం వేయనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్రకటించింది. ఈ మేరకు జీసీసీ విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ పరిధిలోని రోడ్డు పక్కన దీర్ఘకాలంగా పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారిన 525 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, ఈ వాహనాల వివరాలు www.chennaicorporat-ion.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేశారు. ఈ వాహనాలను క్లెయిమ్ చేసుకునే వారు 15 రోజుల్లోపు సంబంధిత వార్డ్ అసిస్టెంట్, జోనల్ ఆఫీస్, పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలి. 15 రోజుల్లోపు క్లెయిమ్ చేయని వాహనాలను వేలంలో విక్రయించనున్నట్లు జీసీసీ తెలిపింది.

కేవీ పాఠశాలలో లిటరరీ ఫోరమ్ ప్రారంభం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న అతిథులు, పాఠశాల నిర్వాహకులు

తిరుత్తణి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా ఆర్కే పేటలోని కేవీ పాఠశాల (సీబీఎస్ఈ) ప్రాంగణంలో గురువారం ఉదయం లిటరరీ ఫోరమ్ జిల్లా విద్యాశాఖ అధికారి తెన్‌మొళి అధ్యక్షతన ప్రారంభమైంది. కేవీ పాఠశాల వ్యవస్థాపకులు ఇప్రవీణ్‌కుమార్ ఈ కార్యక్రమానికి స్వాగతోపన్యాసం చేయగా, ముఖ్యఅతిథిగా తమిళనాడు విద్యాసేవల కార్పొరేషన్ అధ్యక్షులు ఇ.లియోని హాజరై లిటరరీ ఫోరమ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సి.గోమతి, వైస్ ప్రిన్సిపాల్ నందిని, సీనియర్ ఉపాధ్యాయులు సుబ్రమణియన్, బలరామన్, ఈశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

తిరుత్తణి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలో గురువారం ఉదయం బైక్ నడుపుతూ ప్రమాదానికి గురై ఓ యువకుడి మృతిచెందాడు. వివరాలిలా... పళ్లిపట్టు సమీపంలోని నేడియం గ్రామానికి చెందిన మనోజ్ (24), అదేగ్రామానికి చెందిన మణికంఠన్ (36) కలిసి గురువారం ఉదయం సొర్కైపేట నుండి పోదట్టూరుపేటకు బైక్‌పై బయలుదేరారు. లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా బైక్ అదుపుతప్పింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి, గాయపడిన వారిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మనోజ్ గురువారం సాయంత్రం మృతిచెందాడు.

పరువు హత్యకేసులో సుర్జిత్ బంధువు అరెస్టు


అరెస్టయిన సుర్జిత్ బంధువు జయపాలన్

టి.నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలిలో చెన్నై ఐటీ ఉద్యోగి కవిన్ పరువు హత్యకేసులో నిందితుడు సుర్జిత్ బంధువును సీబీసీఐడీ పోలీసులు అరెస్టు చేశారు. తూత్తుకుడి జిల్లా ఆరుముగమంగళం ప్రాంతానికి చెందిన కవిన్ జూలై 27న తిరునల్వేలిలో దారుణహత్యకు గురయ్యాడు. బలహీన వర్గానికి చెందిన కవిన్ ఉన్నత కులానికి చెందిన ఓ యువతిని ప్రేమించాడు. వీరి ప్రేమను యువతి తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో యువతి తమ్ముడు సుర్జిత్ కేటీసీ నగర్ రోడ్డులో హతమార్చాడు. ఇటీవలే కోర్టు ఉత్తర్వు ప్రకారం సీబీసీఐడీ పోలీసులు సుర్జిత్‌ను తమ కస్టడీకి తీసుకుని విచారణ జరిపారు. సుర్జిత్‌ను హత్య జరిగిన ప్రాంతానికి తీసుకెళ్ళి విచారణ జరిపారు. ఆ సందర్భంగా కవిన్‌ను హతమార్చిన విధానాన్ని సుర్జిత్ ప్రదర్శించాడు. పోలీసులు ఆ దృశ్యాన్ని వీడియో తీసారు. ఈ నేపథ్యంలో కవిన్ పరువు హత్యలో మరికొందరికి సంబంధం ఉంటుందని భావించిన సీబీసీఐడీ పోలీసులు ఆ దిశగా విచారణ జరిపి సుర్జిత్ పిన్ని కుమారుడు జయపాలను బుధవారం రాత్రి అరెస్టు చేశారు.

తండ్రీకొడుకుల రిమాండ్ పొడిగింపు...

కవిన్ సెల్వగణేష్ పరువు హత్యకేసులో అరెస్టయిన సుర్జిత్, అతడి తండ్రి శరవణకుమార్ రిమాండ్ పొడిగించారు. రెండు రోజుల కస్టడీ పూర్తికావటంతో సీబీసీఐడీ వీరిని తిరునల్వేలిలోని అంటరానితనం నిరోధక ప్రత్యేక న్యాయస్థానం మేజిస్ట్రేట్ హేమ ఎదుట హాజరుపరిచారు. ఇద్దరికీ ఈ నెల 26 వరకూ జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తూ ఆమె ఉత్తర్వు జారీ చేశారు. ఆ తర్వాత వారిని పోలీసులు పాళయంకోట సెంట్రల్ జైలుకు తరలించారు.

మూడు రోజుల వరుస సెలవులు

- విమాన ఛార్జీలకు రెక్కలు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో విమాన చార్జీలకు రెక్కలు వచ్చాయి. శుక్రవారం స్వాంతంత్ర్య దినోత్సవం నుంచి శని, ఆదివారాలు కలిపి మూడు రోజులు వరుస సెలవుల కారణంగా ప్రజలు స్వగ్రామాలు, పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్నారు. బస్సులు, రైళ్లలో వెళ్లి వచ్చేందుకు రెండు రోజులు పడుతుండడంతో చాలామంది విమానాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో, విమానాశ్రయాలు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. అదే సమయంలో విమాన ఛార్జీలు కూడా భారీగా పెరిగాయి. నగరం నుంచి మదురై, తూత్తుకుడి, తిరుచ్చి, కోయంబత్తూర్, సేలం తదితర ప్రాంతాలకు వెళ్లే విమానాల టిక్కెట్లు ఫుల్ కాగా, కొన్ని విమానాల్లో మాత్రం తక్కువ సంఖ్యలో టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో, ఒక్కసారిగా విమాన ఛార్జీలు పెరిగాయి. చెన్నై నుంచి మదురైకి రూ.4,000 ఉన్న టిక్కెట్ ఛార్జీ గురువారం రూ. 16,769కి పెరిగింది. ఇక, చెన్నై నుంచి తూత్తుకుడికి రూ.3,843 ఉన్న ఛార్జీ రూ.21,867, చెన్నై నుంచి తిరుచ్చికి రూ.,1,827 ఉన్న ఛార్జీ రూ.14,518కి పెరిగింది. అలాగే, చెన్నై నుంచి కోవైకి రూ.3,818గా ఉన్న ఛార్జీ రూ.15,546, చెన్నై నుంచి సేలంకు రూ.3,398 ఉన్న ఛార్జీ రూ.7,613కు పెరిగింది.

సీఎం పేరు వాడకుండా స్టే విధించాలంటూ పిటిషన్

- పిటిషనర్‌కు రూ. లక్ష జరిమానా

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంలో ముఖ్యమంత్రి పేరు వినియోగించడంపై నిషేధం విధించాలంటూ దాఖలైన ప్రజావ్యాజ్యం కేసు విచారించిన మద్రాస్ హైకోర్టు పిటిషనర్‌కు రూ. లక్ష జరిమానా విధించి తోసిపుచ్చింది. అన్నాడీఎంకే న్యాయవాది ఇనియన్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంలో ముఖ్యమంత్రి పేరు వినియోగించడంపై స్టే విధించాలని కోరారు. ఈ పిటిషన్ గురువారం ప్రధాన న్యాయమూర్తి ఎంఎం శ్రీవాస్తవ, న్యాయమూర్తి సుందర్ మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఇలాంటి కోరికతో సీవీ షణ్ముగం దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు జరిమానా విధించి తోసిపుచ్చిందని పేర్కొంటూ, ఉత్తర్వుల నకలు ప్రభుత్వ తరఫున హాజరైన ప్రధాన న్యామవాది పీఎస్ రామన్, డీఎంకే తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది పి.విల్సన్ కోర్టులో సమర్పించారు. వీరి వాదన పరిగణలోకి తీసుకున్న న్యాయస్థానం, ఇనియన్‌ను రూ. లక్ష జరిమానాతో తోసిపుచ్చుతున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

17న పీఎంకే ప్రత్యేక సర్వసభ్య సమావేశం

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పాట్టాలి మక్కల్ కట్చి (పీఎంకే) ప్రత్యేక సర్వసభ్య సమావేశం ఈ నెల 17న విల్లుపురం జిల్లా పట్టానూరులో జరుగుతుందని ఆ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ రాందాస్ ప్రకటించారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఆదివారం జరగనున్న పార్టీ సర్వసభ్యసమావేశం రాష్ట్రరాజకీయాల్లో గొప్ప మలుపు తీసుకొస్తుందని నమ్మకం వ్యక్తంచేశారు.

తొట్టినాయకర్ వర్గీయులు మద్యం ముట్టుకోరు : సి.మహేంద్రన్

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో తొట్టినాయకర్ వర్గానికి చెందిన వారు మద్యం ముట్టుకోరని మద్యం, మాదకద్రవ్యాల నివారణ సంస్థ ఆర్గనైజర్ సి.మహేంద్రన్ పేర్కొన్నారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, తొట్టినాయకన్ కులానికి చెందిన ప్రజలు రాష్ట్రంలో వెయ్యి గ్రామాల్లో నివశిస్తున్నారని తెలిపారు. దిండుగల్, కరూర్, తిరుచ్చి జిల్లాల్లో ఉన్న 25 కుగ్రామాల్లో మద్యం, ధూమపానం పూర్తిస్థాయిలో నిషేధించారని, ఇందువల్ల 60యేళ్లకు పైగా పలువురు సీనియర్ సిటీజన్లు ఇప్పటికీ ఆరోగ్యంగా జీవిస్తున్నారని తెలిపారు. ఈ గ్రామస్తులంతా తొట్టినాయకర్ వర్గంలోని సిల్లవర్ తెగకు చెందినవారని, సామాజిక క్రమశిక్షణను వీరు గట్టిగా నమ్ముతున్నారని తెలిపారు. అదేవిధంగా తొట్టినాయకర్ వర్గం వారు నివసించే గ్రామాల్లో మద్యం సేవించరని, వీరిని ఆదర్శంగా తీసుకున్న ఇతర కులాలకు చెందిన ప్రజలు మత్తు పదార్థాల అలవాట్ల నుండి బయటపడి జీవిస్తున్నారన్నారు.

రేపు, 18న చెన్నై-గుమ్మిడిపూండి మధ్య 17 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెన్నై డివిజన్ పరిధిలోని పొన్నేరి-కవరైపేట రైల్వే స్టేషన్ల మధ్య రైలు మార్గాల్లో మరమ్మతుల కారణంగా ఈ నెల 16, 18 తేదీల్లో చెన్నై సెంట్రల్-గుమ్మిడిపూండి మధ్య 17 సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- చెన్నై బీచ్-గుమ్మిడిపూండి ఉదయం 9.40, మధ్యాహ్నం 12.40, చెన్నై సెంట్రల్-సూళ్లూరుపేట ఉదయం 10.15, మధ్యాహ్నం 12.10, 1.05, గుమ్మిడిపూండికి ఉదయం 10.30, 11.35, ఆవడికి రాత్రి 11.40, సూళ్లూరుపేట-నెల్లూరు మధ్యాహ్నం 3.50 గంటల సబర్బన్ రైళ్ల రద్దు.
- గుమ్మిడిపూండి-చెన్నై బీచ్ ఉదయం 10.55, సెంట్రల్‌కు మధ్యాహ్నం 12, 2.30, 3.15, సూళ్లూరుపేట-సెంట్రల్ మధ్యాహ్నం 1.15, రాత్రి 9, నెల్లూరు-సూళ్లూరుపేట సాయంత్రం 6.45 గంటల సబర్బన్ రైళ్ల రద్దు.
- చెంగల్పట్టు-గుమ్మిడిపూండి ఉదయం 9.55 గంటలకు వెళ్లే సబర్బన్ రైలు చెన్నై బీచ్ వరకు మాత్రమే నడుస్తుంది. గుమ్మిడిపూండి-తాంబరం మధ్యాహ్నం 3 గంటల రైలు చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది.

ప్రత్యేక రైళ్లు...

చెన్నై సెంట్రల్-పొన్నేరి ఉదయం 10.30, మీంజూరు ఉదయం 11.35, చెన్నై బీచ్-పొన్నేరి మధ్యాహ్నం 12.10, పొన్నేరి-చెన్నై సెంట్రల్ మధ్యాహ్నం 12.18, 3.33, మీంజూరు-చెన్నై సెంట్రల్ మధ్యాహ్నం 2.50 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

మిద్దెపై గంజాయి సాగు

- యువకుడి అరెస్టు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మిద్దెపై గంజాయి మొక్కలు పెంచుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కన్నియాకుమారి జిల్లా మార్తాండం పోలీసులు బుధవారం సాయంత్రం గస్తీ తిరిగారు. ఆ సమయంలో అటు వచ్చిన యువకుడు పోలీసుల చూసి భయంతో పరుగులు తీయడంతో, పోలీసులు వెంటాడి పట్టుకుని, అతడి నుంచి 50 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో... మార్తాండం సమీపం చెట్టిసార్‌విలై ప్రాంతానికి చెందిన సుభాష్ కృష్ణన్ (29) అని తెలిసింది. అతడింట్లో తనిఖీలు చేసిన పోలీసులు, మిద్దెపై పూల మొక్కల మధ్య గంజాయి మొక్కలను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు.

పోక్సో చట్టం దుర్వినియోగం

- మహిళపై కేసు నమోదు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అబద్ధపు ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద మామను జైలుకు పంపేందుకు యత్నించిన మహిళపై పోలీసులు కేసు నమోదుచేశారు. రాయపేట మహిళా పోలీస్ స్టేషన్‌లో ఇటీవల ఓ మహిళ తన కుమార్తెపై మామ లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంపై పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసిన పోలీసులు, మామను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించగా.. లైంగిక వేధింపుల కేసు అసత్యమని తెలిసింది. దీంతో, పోలీసులు బాలికను ప్రశ్నించగా తాత తనపై ఎలాంటి వేధింపులకు పాల్పడలేదని తెలిపింది.ఈ వ్యవహారంపై పోలీసులు చేపట్టిన విచారణలో... మామ స్థితిమంతుడు కాగా, అతడికి ఇళ్ల అద్దె ద్వారా నెలకు రూ.60 వేలువస్తోంది. ఆయన కుమారుడు ఎంఈ చదివి, ఉద్యోగానికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండడంతో, తండ్రి తరచూ అతడిని మందలిస్తున్నట్లు సమాచారం. దీంతో, మామను జైలుకు పంపి ప్రశాంతంగా ఉండాలని నిర్ణయించిన కోడలు,తన కుమార్తెపై లైంగికవేధింపులకు పాల్పడుతున్నాడంటూ అబద్ధపు ఫిర్యాదు చేసిందని తెలిసింది. దీంతో, అసత్య ఫిర్యాదు చేసిన కోడలిపై కేసు నమోదుకు కోర్టు అనుమతి కోరినట్లు పోలీసులు తెలిపారు.

జరిమానా చెల్లిస్తే విడుదల

- జాలర్లకు నిబంధన విధించిన శ్రీలంక కోర్టు

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరానికి చెందిన ఏడుగురు జాలర్లను శ్రీలంక కోర్టు నిబంధన విధించింది. సరిహద్దులు దాటారంటూ రామేశ్వరానికి చెందిన ఏడుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి న్యాయమూర్తి ఉత్తర్వులతో జైలుకు తరలించారు. జాలర్ల రిమాండ్ గడువు ముగియడంతో బుధవారం వారిని మన్నార్ కోర్టులో హాజరుపరిచారు. జాలర్లు తలా రూ.1.75 లక్షల జరిమానా చెల్లించాలనే నిబంధన విధించిన న్యాయస్థానం, జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల జైలు శిక్ష ఉంటుందని హెచ్చరించింది. ఈ విషయమై జాలర్ల సంఘాలు కేంద్ర ప్రభుత్వం, శ్రీలంకలోని భారత దౌత్య కార్యాలయంతో సంప్రదిస్తున్నారు.

జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు

- డీజీపీ నియామక వ్యవహారం...

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డీజీపీ నియామకం వ్యవహారంలో జోక్యం చేసుకోలేమన్న హైకోర్టు, పిటిషన్ తోసిపుచ్చుతున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ పదవీకాలం ఈ నెల 31తో ముగియనుంది. కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియ ప్రారంభించాలి, ఇన్‌ఛార్జీ డీజీపీని నియమించరాదని కోరుతూ హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో ప్రజావ్యాజ్యం దాఖలైంది. ఈ పిటిషన్ గురువారం విచారించిన న్యాయమూర్తులు, ఎంపిక ప్రక్రియ ప్రారంభమైందా? లేదా? అనే విషయమై రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్నం 2.15 గంటలకు అఫిడవిట్ దాఖలుచేయాలని ఆదేశిస్తూ విచారణ వాయిదావేసింది. మధ్యాహ్నం 2.15 గంటలకు కేసు మళ్లీ విచారణకు రాగా ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు అడ్వొకేట్ జనరల్ అజ్మల్ ఖాన్ హోంశాఖ కార్యదర్శి నుంచి వివరాలు పొందారని,, కొత్త డీజీపీ ఎంపిక ప్రక్రియ ప్రారంభించినట్లు కోర్టుకు తెలియజేశారు. అనంతరం న్యాయమూర్తి, ఈ పరిస్థితుల్లో న్యాయస్థానం జోక్యం చేసుకొనేందుకు ఆసక్తి చూపడం లేదంటూ పిటిషన్ తోసిపుచ్చుతూ కేసు విచారణ ముగిసినట్లు ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీ కుమార్తెల మృతి

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లాలో గురువారం కారు-బైక్ ఢీకొన్న ఘటనలో తండ్రి, ఇద్దరు కుమార్తెలు మృతిచెందగా, తల్లి, అక్క కుమారుడికి గాయాలయ్యాయి. వల్లం కొల్లుపేట ప్రాంతానికి చెందిన అరివళగన్ (37)-ఉష దంపతులకు రూప (10), భవ్యశ్రీ (9) అనే కుమార్తెలున్నారు. ఈ క్రమంలో, పనంగాడు ప్రాంతంలోని ఆలయానికి అరివళగన్, తన భార్య, ఇద్దరు కుమార్తెలు, అక్క కుమారుడు తేజశ్రీ (4)తో కలసి ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. మాదాకోట బైపాస్ రోడ్డు మీదుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని కేరళ నుంచి నాగూర్ దర్గాకు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో అరివళగన్, రూప, భవ్యశ్రీ ఘటనా స్థలంలోనే మృతిచెందారు. చుట్టుపక్కల వారు గాయపడిన ఉష, తేజశ్రీని తంజావూరు వైద్యకళాశాల ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై తమిళ విశ్వవిద్యాలయం పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

నీటమునిగి ఇద్దరు విద్యార్థులు....

కోయంబత్తూర్ జిల్లా అరక్కన్‌కోట చెక్‌డ్యాంలో మునిగి ఇద్దరు విద్యార్థులు మృతిచెందారు. శక్తినికేతన్ (19), శిబిరాజ్ (18)లు స్నేహితులతో కలసి చెక్‌డ్యాంకు వెళ్లారు. వారు స్నానాలు చేస్తున్న సమయంలో శక్తినికేతన్, శిబిరాజ్ నీటమునిగారు. స్నేహితుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకున్న పంగళాపుదూర్ పోలీసులు సుమారు మూడు గంటలు శ్రమించి రెండు మృతదేహాలు వెలికితీసి, పోస్టుమార్టంకు తరలించారు.

డెత్ సర్టిఫికెట్‌కు లంచం

- వీఏవో అరెస్టు


అరెస్టయిన వీఏవో సెంథిల్‌కుమార్

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపంలోని ఈరాచ్చి గ్రామ నిర్వాహక కార్యాలయంలో డెత్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.3,500 పుచ్చుకున్న వీఏవోను ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. మహేశ్వరి అనే మహిళ తన తాత సుబ్బు, బామ్మ మారియమ్మాళ్‌ల డెత్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ ఈరాచ్చి గ్రామ పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేశారు. వీఏవో సెంథిల్‌కుమార్ రూ.3,500 డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై ఆమె తూత్తుకుడి జిల్లా ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా, వారి సూచనమేరకు రసాయనాలు పూసిన రూ.3,500లను అందిస్తుండగా సెంథిల్‌కుమార్‌ను ఏసీబీ అధికారులు గురువారం అరెస్టు చేశారు.సెంథిల్‌కుమార్ 2012లో కూడా పట్టామార్పు కోసం రూ.3000లంచంగా పొందినట్లు అతనిపై మరోకేసున్నట్లు విచారణలో తేలింది.

26కు కొడనాడు కేసు విచారణ వాయిదా

పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొడనాడు హత్య, చోరీ కేసు విచారణ ఈ నెల 26వ తేదీకి వాయిదావేస్తూ ఊటీ జిల్లా కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కేసులో 10వ నిందితుడు జితన్ జాయ్ గురువారం జరిగిన విచారణకు హాజరయ్యాడు. విచారణ కీలక దశకు చేరుకున్నందున మరికొంతమంది సాక్ష్యులను విచారించేందుకు మరింత సమయం అవసరమని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు విజ్ఞప్తి చేశారు.

13 రోజుల నిరవధిక సమ్మెకు బ్రేక్

- అర్ధరాత్రి పారిశుధ్య కార్మికుల అరెస్టు



పారిశుధ్య కార్మికులను బలవంతంగా తొలగిస్తున్న పోలీసులు

టి.నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో జోన్ల వారీగా పారిశుధ్య పనులను ప్రైవేటు సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ, తమ ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ రిప్పన్ భవనం ఎదుట 13 రోజులుగా సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులను బుధవారం అర్ధరాత్రి పోలీసులు అరెస్టు చేశారు. కార్పొరేషన్ పరిధిలోని రాయపురం, తిరువికనగర్ జోన్లలో పారిశుధ్య పనులను ప్రైవేటు సంస్థకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల ఒకటి నుండి ఆ రెండు జోన్లకు చెందిన పారిశుధ్య కార్మికులు రిప్పన్ భవనం ఎదుట ప్లాట్‌ఫామ్‌పై నిరవధిక సమ్మె ప్రారంభించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులను తొలగించాలని హైకోర్టు ఆదేశించినప్పటి నుండి ఆ ప్రాంతం వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బుధవారం మధ్యాహ్నం 200 మంది మహిళా కానిస్టేబుళ్లతో సహా సుమారు 500 మంది పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులను పీఎంకే ప్రధాన కార్యదర్శి మురళీశంకర్, తమిళ మానిల బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకురాలు పొర్కొడి ఆమ్‌స్ట్రాంగ్, అన్నాడీఎంకే మాజీ ఎంపీ బాలగంగా, బీజేపీ మహిళా నాయకురాలు డాక్టర్ తమిళిసై తదితరులు పరామర్శించారు. ఆ తర్వాత నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ, మేయర్ ఆర్.ప్రియ సమక్షంలో పారిశుధ్య కార్మికుల సంఘాల ప్రతినిధులతో జరిగిన ఎనిమిదో విడత చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాత సమ్మె చేస్తున్న పారిశుధ్య కార్మికులను అరెస్టు చేసి తరలించడానికి బస్సులు తెప్పించారు. హైకోర్టు ఉత్తర్వు ప్రకారం ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయమంటూ పోలీసులు పారిశుధ్య కార్మికులతో చర్చలు జరిపారు. ఎట్టి పరిస్థితులలోనూ తాము సమ్మె విరమించి ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసే ప్రసక్తే లేదని ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి పారిశుధ్య కార్మికులందరినీ పోలీసులు లేపి అరెస్టు చేయసాగారు. ఆ సందర్భంగా మహిళా కార్మికులు, పోలీసులకు మధ్య తీవ్రవాగ్వాదం జరిగింది. అదే సమయంలో మంత్రి నెహ్రూ, మేయర్ ప్రియా, ముఖ్యమంత్రి స్టాలిన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. పది బస్సుల్లో పారిశుధ్య కార్మికులను ఎక్కించి అడయార్, గిండి, సైదాపేట, వేళ్లచ్చేరి ప్రాంతాల్లోని కార్పొరేషన్ సామాజిక కేంద్రాలకు తరలించారు.


● పంద్రాగస్టు ప్రత్యేకం


సిపాయిల స్మారక స్థూపం

వేలూరు కోట చరిత్రలో ఓ పుట

● స్వాతంత్ర్య సంగ్రామానికి తొలి వేదిక ● సిపాయిల తిరుగుబాటు పోరాటానికి తొలిఅడుగు

ప్రసిద్ధి చెందిన వేలూరు కోట



వేలూరు, ఆంధ్రజ్యోతి

భరతమాత దాస్య శృంఖలాలు తెగేందుకు అవసరమైన స్వాతంత్ర్య సంగ్రామానికి తొలి వేదిక వేలూరు కోట. క్రీ.పూ 1806వ సంవత్సరం జూలై 10వ తేది వేలూరు కోటలో జరిగిన సిపాయిల తిరుగుబాటు దేశ స్వాతంత్ర్య పోరాటానికి తొలి అడుగు. వేలూరు కోటలో తిరుగుబాటుకు కారకులైన 117 మంది సిపాయిలను విచారణ అనంతరం కోటలో ఉన్న చెట్టుకు ఉరి తీశారు. మరో 300 మందిని కాల్చి చంపారు. 600 మంది సిపాయిలని తిరుచ్చి జైలులో బంధించగా, మరో 500 మందిని దేశం నుంచి బహిష్కరించారు.

క్రీ.పూ 1799వ సంవత్సరంలో శ్రీరంగం పట్టణంలో జరిగిన యుద్ధంలో ఆంగ్లేయులు టిప్పు సుల్తాన్‌ను హతమార్చారు. అనంతరం ఆయన 12 మంది కుమారులు, 8 మంది కుమార్తెలు, బంధువులు కలిపి 1,378 మందిని అరెస్ట్ చేసి వేలూరు కోట జైలులో ఉంచారు. వీరిలో టిప్పు సుల్తాన్ కుమారులు, కుమార్తెలను కోట లోపల ఉన్న టిప్పు మహల్, హైదర్‌మహల్‌లో బంధించారు. వీరికి పనులు చేసేందుకు వచ్చిన 1812 మందిని కోట వెలుపల ఉంచి, ప్రతిరోజూ మూసిన పల్లకీలో కోటకు వచ్చేందుకు అనుమతించారు. వారు మరణించిన తర్వాత ఏర్పాటు చేసిన వారి సమాధులు ఆర్కాడు రోడ్డులో ఇప్పటికీ వున్నాయి.

సిపాయిల స్మారక స్థూపం...

యుద్ధంలో మృతిచెందిన సిపాయిల మృతదేహాలను కోట మైదానంలో విసిరివేశారు. అలాగే, యుద్ధంలో మృతిచెందిన ఆంగ్లేయుల అధికారుల మృతదేహాలను కోట వెలుపల సమాధి చేశారు. సిపాయిల తిరుగుబాటు స్మారకార్థం కోటకు ఎదురుగా ఉన్న మక్కాన్ ప్రాంతంలో 1998లో స్మారక స్థూపం ఏర్పాటుచేశారు. ప్రతి ఏడాది జూలై 10వ తేది ఈ స్థూపం వద్ద సైనిక, జిల్లా అధికారులు నివాళులర్పిస్తుంటారు. సిపాయి యుద్ధం స్మారకంగా ప్రత్యేక తపాలా బిళ్ల కూడా విడుదల చేశారు. 8వ తరగతి పాఠ్యపుస్తకంలో సిపాయిల తిరుగుబాటుపై ఒక పాఠ్యాంశం కూడా ఉంది. స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులు ఉపయోగించిన ఫిరంగులు, పేలుడు మందు కలిపిన ఇనుప గిన్నె వేలూరు ప్రభుత్వ మ్యూజియంలో భద్రపరిచారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఇప్పుడు కోటను అందంగా తీర్చి దిద్దారు.


పేలుడు మందు కలిపేందుకు ఉపయోగించిన జాడీ


ఆంగ్లేయులు, సిపాయిల యుద్ధంలో పగులగొట్టిన కోట ప్రహరీ గోడ




కోటలోని టిప్పు మహల్, హైదర్ మహల్


కోట లోని ఇనుప గుండు

మహేంద్రా వరల్డ్ సిటీలో రూ.700 కోట్లతో హికోకి పవర్‌టూల్స్ ఫ్యాక్టరీ

● సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందం


ఒప్పంద పత్రాలతో హికోకి పవర్‌టూల్స్ సంస్థ ప్రతినిధులు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలోని మహీంద్రా వరల్డ్ సిటీలో జపాన్‌కు చెందిన 'కోకి హోల్డింగ్' అనుబంధ సంస్థ హికోకి పవర్‌టూల్స్ సంస్థ రూ.700 కోట్లతో విద్యుత్ పరికరాల కర్మాగారాన్ని నెలకొల్పనుంది. ఈ కర్మాగారం ద్వారా 1000 మంది స్థానికులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలను కల్పించనుంది. చెన్నై సచివాలయంలో గురువారం ఉదయం ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సమక్షంలో ఈ మేరకు అవగాహన ఒప్పందం కుదిరింది. హికోకి పవర్‌టూల్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 15కు పైగా విక్రయకేంద్రాలున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంతో ఆ సంస్థ ప్రతినిదులు అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, పెట్టుబుడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల మంత్రి టీఆర్‌బీ రాజా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం,, పెట్టుబడుల ప్రోత్సాహక వాణిజ్య శాఖల కార్యదర్శి వి. అరుణ్‌రాయ్, కోకి గ్రూపు సంస్థ సీఈఓ ప్రతాప్ దైవనాయగం, కోకి ఇండియా సంస్థ డైరెక్టర్ బాలసుబ్రమణ్యన్ కోదండరామన్ తదితరులు పాల్గొన్నారు.

నామక్కల్‌లో సహకార బ్యాంక్ ప్రారంభం...

సహకార శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నామక్కల్ జిల్లా సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. సేలం జిల్లా సెంట్రల్‌కో-ఆపరేటివ్ బ్యాంక్‌ను రెండుగా విభజించి నామక్కల్‌లో కొత్త సహకార బ్యాంక్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మూడు దశాబ్దాల తర్వాత ఏర్పాటైన నామక్కల్ జిల్లా సెంట్రల్ కో-ఆపరేటివ్ బ్యాంక్‌లో ఎండీ, జనరల్ మేనేజర్, ఇద్దరు అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, నలుగురు ఆఫీసు సహాయకులు పనిచేస్తున్నారు. ఈ బ్యాంక్‌ను సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు కేఆర్ పెరియకరుప్పన్ ఎం.మదివేందన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్. మురుగానందం, సహాక ఆహార వినియోగదారుల భద్రతా శాఖ ముఖ్య కార్యదర్శి సత్యప్రద సాహూ, సహకార సంఘాల అడిషనల్ రిజిస్ట్రార్ ఎస్‌పి, అమృత్ తదితరులు పాల్గొన్నారు.


ఆధ్యాత్మికం

● రేపు కృష్ణాష్టమి సందర్భంగా ప్రత్యేకం...


విద్యుద్దీప కాంతుల్లో ఇస్కాన్ టెంపుల్

కృష్ణమ్ వందే జగద్గురుం..

● శ్రీ కృష్ణుడి పేరు వినగానే గుర్తొచ్చే 'ఇస్కాన్'


ఇస్కాన్ వ్యవస్థాపకులు భక్తి వేదాంతస్వామి ప్రభుపాద

మాసమంతా పండుగలతో నిండి ఉండే అతి పవిత్రమైన 'శ్రావణమాసం'. శ్రావణశోభను మరింత ఇనుమడింపజేస్తుంది 'శ్రీకృష్ణ జయంతి' పర్వదినం. ఎన్నివేల సంవత్సరాలు గడిచినా ' వసుదేవసుతం దేవం.. కంస చాణూర మర్ధనం.. దేవకీ పరమానందం.. కృష్ణం వందే జగద్గురుమ్' అంటూ నేటికీ ఎంతో భక్తిప్రపత్తులతో శ్రీకృష్ణ జన్మదినాన్ని దేశ, విదేశాల్లో ఘనంగా జరుపుకుంటున్నారు. శ్రీకృష్ణాష్టమిని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పేరుతో జరుపుకుంటారు. 'గోకులాష్టమి, శ్రీకృష్ణజయంతి, అష్టమి రోహిణి, జన్మాష్టమి తదితర పేర్లు వ్యాప్తిలో ఉన్నాయి. పూర్వం కృష్ణాష్టమి 11రోజుల పండుగగా చేసేవారు. వీధుల్లో పందిళ్లు వేసి కృష్ణుని ప్రతిమను పెట్టి 11 రోజులు పూజించేవారు. కృష్ణలీలలు ప్రదర్శించేవారు. ఉట్టికొట్టడం, వెన్నదొంగ ఆట మొదలైనవి ఆడుతూ 11రోజుల పాటు ఉత్సవాలు చేసేవారు.

- వేళచ్చేరి, ఆంధ్రజ్యోతి

వివిధ ప్రాంతాల్లో జన్మాష్టమి...

శ్రీకృష్ణుని జన్మస్థానమైన ఉత్తరప్రదేశ్‌లోని మధురలో జన్మాష్టమి వేడుకలు రెండు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. మొదటిరోజు అర్ధరాత్రి అక్కడి 'కృష్ణజన్మభూమి' మందిరంలోని రాధాకృష్ణులకు జరిగే ప్రత్యేకమైన పూజలతో వేడుకలు ప్రారంభమవుతాయి. పంచామృతాలతో దేవతామూర్తులను అభిషేకించి, భజనలు, కీర్తనలు, నృత్యాలతో స్వామివారిని సేవిస్తారు. మధ్యాహ్నం 56 రకాల వంటలు చేసి స్వామివారికి నివేదన చేస్తారు. దీనినే 'ఛప్పన్‌భోగ్' అంటారు. మధురానగరం అంతటా కృష్ణుడి లీలలను తెలిపే నృత్యనాటకాలు (రాసలీలలు) ప్రదర్శిస్తారు. ఆలయ ప్రాంగణంలో పూలతో అలంకరించిన ఊయలలు కడతారు. తర్వాత నగరవీధులలో ఉట్టికొట్టే కార్యక్రమం కన్నుల పండువగా జరుగుతుంది. ఉట్టిని అందుకునేందుకు యువతీ,యువకులు పోటీ పడటం ప్రత్యేక ఆకర్షణ.

ముంబాయిలో ఉట్టికొట్టే కార్యక్రమం భారీస్థాయిలో జరుగుతుంది. ఎన్నో వేల ఉట్లు కొట్టేందుకు ఎంతోమంది పోటీ పడుతుంటారు. మధ్యప్రదేశ్‌లో జన్మాష్టమి విభిన్నంగా జరుపుకుంటారు. ప్రతి ఏటా ఇక్కడ స్వామికి నామకరణోత్సవం జరిపి కృష్ణుడికి రకరకాల పేర్లు పెడతారు. గుజరాత్‌లోని ద్వారకా నగరాన్ని కృష్ణాష్టమి సందర్భంగా విశేషంగా అలంకరిస్తారు. ద్వారకానగరంలోని దేవాలయాల్లో భజన, కీర్తన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ప్రజలు ఈ సందర్భంగా గర్బా నృత్యం చేస్తారు. గోవాలోని దేవకీ ఆలయంలో 'అష్టమ్' పేరుతో కృష్ణాష్టమి జరుపుకుంటారు. బెంగాల్, ఒడిశా రాష్ట్రాల్లో కృష్ణాష్టమి నాడు భక్తులు ఉపవాసం చేసి, అర్ధరాత్రి పురాణ ప్రవచనం, భగవద్గీత పారాయణం చేస్తారు. కృష్ణాష్టమి మరుసటి రోజు వీరు 'నంద ఉత్సవం' జరిపి శ్రీకృష్ణుణ్ణి పెంచిన యశోద, నందులకు ప్రత్యేక పూజలు చేస్తారు. కేరళలో ఉన్న గురువాయూరు, కర్నాటకలోని ఉడిపిలోనూ జన్మాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో కృష్ణాష్టమి రోజున వాకిళ్లలో పిండిముగ్గులు వేస్తారు. తమ ఇంట్లోకి వస్తున్నట్లుగా కన్నయ్య బుజ్జిపాదాలను తీర్చి దిద్దుతారు. చిన్న పిల్లలకు కృష్ణుడి వేషాలు వేసి ఆనందిస్తారు. నేపాల్‌లో ఆ రోజున భక్తులు ఉపవాసం ఉండి భజన చేసి కృష్ణుడిని పూజిస్తారు. బంగ్లాదేశ్‌లోని 'ఢాకేశ్వరీ' ఆలయం నుంచి పాతబస్తీ వరకు కృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తారు. 'ఫిజి' దేశంలో హిందువులు ఎక్కువగా ఉండటంతో అక్కడ కూడా జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుగుతాయి. అదేవిధంగా మారిషస్ దేశంలో కూడా కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తుంటారు. అమెరికా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్ తదితర దేశాల్లో భారతీయులు జన్మాష్టమి వేడుకలను ఉత్సాహంతో జరుపుకుంటారు. కృష్ణునికి వడపప్పు, పానకం, పాలు, వెన్న, మీగడ, అటుకులు, జున్ను, పండ్లు వంటివి భక్తులు నివేదన చేస్తారు. కొన్ని రాష్ట్రాల్లో 27 రకాల నైవేద్యాలు చేసి కన్నయ్యకు నివేదన చేసే ఆచారం ఉంది. ఏది ఏమైనా భక్తితో ఒక తులసీదళం అర్పించినా గీతాచార్యుడు సంతుష్టుడవుతాడని పెద్దలు చెబుతారు.


ఇస్కాన్ టెంపుల్

శ్రీకృష్ణుడి పేరు వినగానే గుర్తొచ్చే పేరు 'ఇస్కాన్'. 'ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్' లేదా ఇస్కాన్ అనేది అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం. దీనికి హరేకృష్ణ ఉద్యమం అని కూడా పిలుస్తారు. వీరు దేశ, విదేశాల్లో భగవద్గీత, భక్తియోగాన్ని ప్రచారం చేస్తుంటారు. భారతదేశంలో ప్రతి ప్రధాన నగరంలోనూ ఇస్కాన్ శ్రీకృష్ణమందిరాలున్నాయి. ఇస్కాన్‌ని 1966లో న్యూయార్క్‌లో భక్తి వేదాంతస్వామి ప్రభుపాద స్థాపించారు. ధార్మిక జ్ఞానాన్ని పెంచడం, కృష్ణతత్వాన్ని భగవద్గీతను ప్రచారం చేయడం, సంకీర్తనా ఉద్యమాన్ని ప్రోత్సాహించడం వంటి ఉద్దేశాలతో ఇస్కాన్ స్థాపించబడింది. ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో అనేక నగరాల్లో రాధాకృష్ణుల మందిరాలు వెలిశాయి. ప్రపంచ వ్యాప్తంగా వెయ్యికి పైగా ఇస్కాన్ దేవాలయాలున్నాయి. ఇక్కడి దేవాలయాల్లో రాధాకృష్ణుల విగ్రహాలు జీవకళ ఉట్టిపడుతూ ఆకర్షణీయంగా ఉంటాయి.


రాధాకృష్ణులతో గోపికలు

నగరంలో ఇస్కాన్ ఆలయం

చెన్నైలో ఇస్కాన్‌వారి ఆలయం ఈస్ట్‌కోస్ట్‌రోడ్డులోని షోలింగనల్లూరులో ఉన్నది. ' ఎకరంన్నర స్థలంలో భారీగా నిర్మించబడిన ఆలయ నిర్మాణం.మొదటి అంతస్తులో ఆలయ మందిరం, గ్రౌండ్ ఫ్లోర్‌లో సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాల కోసం ఆడిటోరియం, బేస్‌మెంట్‌లో ప్రసాదం హాలు ఉన్నాయి. ఇస్కాన్ మందిరంలో శ్రీకృష్ణ భగవానుడు, రాధారాణి, వారి సహాయక స్నేహితులు లలిత, విశాఖ, ఇంకా జగన్నాథుడు బలరాముడు, సుభద్రదేవీ కొలుదీరారు. ఇక్కడ చైతన్య ప్రభువు, నిత్యానంద విగ్రహాలను కూడా చూడవచ్చు. ఈ ఆలయంలోని షాండ్‌లియర్‌లోని 500ల హిమాలయా క్వార్ట్ స్ఫటికాలు ఆలయంలోని ఆధ్యాత్మిక చింతన, ప్రాణశక్తి మరింత శక్తివంతం చేస్తాయని చెబుతారు. ఇక్కడ ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి, రాధాష్టమి, రథయాత్ర పండుగలు విశేషంగా నిర్వహిస్తారు. భక్తితో వేడుకగా, ఉత్సాహంగా జరుపుకొనే పండుగ జన్మాష్టమి. కృష్ణుడు కేవలం భగవంతుడిగానే కాక మేనేజ్‌మెంట్ ఎక్స్‌పర్ట్‌గా, వ్యక్తిత్వ వికాస నిపుణుడిగా, యువతకు కూడా ఆదర్శమైన అసాధారణ అవతార పురుషుడిగా, కర్తవ్యజ్ఞాన కర్మయోగ బోధకుడిగా, రాజధర్మపాలకుడిగా ప్రసిద్ధికెక్కాడు. చెన్నైలోని ఇస్కాన్ టెంపుల్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు తెరచివుంటుంది.

ఆలంగుడి దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేకాలు


విశేష అలంకారంలో దక్షిణామూర్తి

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నవగ్రహ క్షేత్రాల్లో ఒకటైన తిరువారూర్ జిల్లా ఆలంగుడి ఆపత్సహాయేశ్వర గురుపరిహార ఆలయంలో గురువారం దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ ఆలయ ప్రాంగణంలోని సన్నిధుల్లో కొలువైన విఘ్నేశ్వరుడు, ఆపత్సహాయేశ్వరుడు, గురుభగవాన్, ఆజ్ఞా గణపతి, నవగ్రహ సన్నిధి, శనీశ్వరులకు ఉదయం 6 గంటలకు ప్రత్యేక అభిషేకాలు, మహా దీపారాధన చేశారు. గురువారం స్వామివారి మూలవిరాట్టుకు బంగారు కవచంతో అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. అదేవిధంగా నీడామంగళం సమీపంలోవున్న కోవిల్‌వెన్ని ప్రాంతంలో సౌందర్యనాయకి సమేత కరుంబేశ్వరాలయం సహా ఈ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో దక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేక, అలంకార దీపారాధన చేయగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని తమ దోషాలు తొలగాలని పూజించారు.


తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినంలోని ముత్తారమ్మన్ ఆలయంలో ఆడిమాసోత్సవాల్లో భాగంగా సప్పరంపై ఊరేగుతున్న అమ్మవారు

రూ.37.38 కోట్లతో క్రీడామైదానాలు

● ప్రారంభించిన సీఎం స్టాలిన్




వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్రీడామైదానాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాశాఖల ఆధ్వర్యంలో ఎచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రూ.37.38 కోట్లతో నిర్మించిన మూడు సీఎం మినీ స్పోర్ట్స్ స్టేడియంలు, ఐదు పారా - క్రీడామైదానాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. తెన్‌కాశిలో జిల్లా క్రీడామైదానాన్ని కూడా ఆయన ప్రారంభించారు. పుదుకోట, తిరుపత్తూరు, తిరుప్పూరు జిల్లాల్లో రూ.9 కోట్లతో నిర్మించిన మూడు సీఎం మినీ స్పోర్ట్స్ స్టేడియంలు, తెన్‌కాశి జిల్లాలో రూ.15కోట్లతో జిల్లా క్రీడామైదానం, చెన్నై, తిరుచ్చి, మదురై , కడలూరు, తిరునల్వేలి ప్రాంతాల్లో రూ.6.38 కోట్లతో నిర్మించిన ఐదు పారా- క్రీడా మైదానాలను కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రారంభించారు. ఇదే విధంగా కోవిల్‌పట్టిలో రూ.7 కోట్లతో నిర్మించిన హాకీ క్రీడా కేంద్రం కూడా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు ఈవీ వేలు, ఎంఆర్కే పన్నీర్ సెల్వం, ఎంపి సామినాదన్, పి.మూర్తి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, యువజన సంక్షేమం క్రీడాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అతుల్యమిశ్రా, రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ మెంబర్ సెక్రటరీ జే మేఘనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు పంపిణీ..

సచివాయలంలో జరిగిన మరో కార్యక్రమంలో విధినిర్వహణ ప్రమాదానికి గురై, సహజసిద్ధంగా మృతిచెందిన ఐదుగురు ప్రభుత్వోద్యోగుల కుటుంబీకులకు ముఖ్యమంత్రి స్టాలిన్, జీవిత బీమా, ప్రమాద బీమా, వివాహ ఆర్థిక సహాయం, ఉన్నత విద్యా సహాయం కింద రూ.4.38 కోట్లను చెక్కు రూపంలో అందజేశారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం గతంలో కుదుర్చుకున్న బీమా ఒప్పందం ప్రకారం స్టేట్ బ్యాంక్, కెనరా బ్యాంక్ ఈ నగదు సమకూర్చాయి. ఈ కార్యక్రమంలో ఆర్థిక మంత్రి తంగం తెన్నరసు, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డి. ఉదయచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నై మూలకొత్తలం ప్రాంతంలో సీఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించనున్న స్పోర్ట్స్ స్టేడియంకు భూమి పూజ చేస్తున్న మంత్రి పీకే శేఖర్ బాబు తదితరులు


తన జన్మదినం సందర్భంగా క్యాంపు కార్యాలయంలో కుటుంబ సమేతంగా తనను కలిసిన డీజీపీ శంకర్‌జివాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

ఆకట్టుకుంటున్న 'కైట్ ఫెస్టివల్'



పెరంబూర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సమీపం తిరువిడం దైలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కైట్ ఫెస్టివల్‌ను గురువారం మంత్రులు టీఎం అన్బరసన్, రాజేంద్రన్ ప్రారంభించారు. నాలుగు రోజులు జరగనున్న ఈ ఫెస్టివల్‌లో జపాన్, వియత్నాం సహా 8 దేశాల గాలిపటాలను ఎగురవేయనున్నారు. అలాగే, దేశంలోని పలు కైట్ సంస్థలు ఈ ఫెస్టివల్‌లో పాల్గొననున్నాయి. తొలిరోజైన గురువారం జాతీయ పతాకం, జంతువులు, తమిళ అక్షరాలతో రూపొందించిన సుమారు 250 వివిధ రంగులతో చేసిన గాలిపటాలు ఎగురుతూ ప్రేక్షకులకు కనువిందు చేశాయి.



ఫెస్టివల్ ప్రారంభిస్తున్న మంత్రులు రాజేంద్రన్, అన్బరసన్ తదితరులు

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.31 కోట్లు
బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,859
తలనీలాలు సమర్పించినవారు: 33,344



| జాన్వీ సందడి |

తల్లి శ్రీదేవి పుట్టిన రోజున బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రతో కలిసి గురువారం తిరుమల శ్రీనివాసుడిని జాన్వీకపూర్ దర్శించుకున్నారు.

పసిబిడ్డగా తాను తల్లిదండ్రులతో కలిసి తిరుమలలో తీసుకున్న ఫోటోను ఇన్‌స్టా ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నారు.



తిరుచెందూరులో ఆవణి ఉత్సవాలు ప్రారంభం





ధ్వజ పతాకాన్ని ఏనుగుపై ఊరేగిస్తున్న సిబ్బంది - ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

టి.నగర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మురుగప్పెరుమాన్ వెలసిన ఆరు దివ్యక్షేత్రాలలో రెండవదైన తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామివారి ఆలయంలలో ఆవణి ఉత్సవాలు గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 25 వరకు 12 రోజులపాటు జరుగనున్నాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఒంటిగంటకు ఆలయాన్ని తెరిచి, 1.30 గంటలకు విశ్వరూప దర్శనం, 2 గంటలకు ఉదయ మార్తాండ అభిషేకం నిర్వహించారు. గురువారం వేకువజాము ఐదు గంటలకు ఆలయ ప్రధానార్చకులు, శైవపండితుల మంతోచ్చారణ మధ్య ధ్వజస్తంభానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి దీపారాధన చేశారు. అనంతరం ధ్వజపతాకాన్ని ఎగురవేశారు. ఈ వేడుకల్లో తిరువాడుదురై ఆధీనం శ్రీమద్ శంకరలింగ్ తంబిరాన్ స్వామి, ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్.జ్ఞానశేఖరన్, తిరుచెందూరు పురపాలక సంఘం ఉపాధ్యక్షుడు సెంగులి రమేష్, ఏరల్ చైర్మన్ ఆలయ పారంపర్య ట్రస్టీ కరుత్తపాండి నాడార్, హిందూ మున్నాని ఉపాధ్యక్షుడు వీపీ జయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదే విధంగా గురువారం సాయంత్రం అప్పర్‌స్వామి స్వర్ణసప్పరంలో ఊరేగింపుగా వెళ్లారు. రాత్రి బెలినాయకర్ అస్త్రదేవుడితో పల్లకీలో నవ సన్నిధుల్లో ఊరేగారు. ఈ ఉత్సవాల్లో ముఖ్యఘట్టం ఈ నెల 18న ఆలయం పై అంతస్తులో రాత్రి 7.30 గంటలకు కుడైవాసల్ వద్ద దీపారాధన జరుగుతుంది. ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 23న మహారథోత్సవం జరుగనుంది. ఈ నెల 20 నుంచి 23 వరకు తిరునల్వేలి, తూత్తుకుడి, సాత్తాన్‌కుళం, నాగర్‌కోవిల్ మార్గాలలో 100కు పైగా ప్రత్యేక బస్సులను నడపనున్నారు. సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు కల్పించనున్నారు.

నేడు 'అముదుమ్ తేనుమ్' మ్యూజిక్ షో

అడయార్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ నటి రాజ సులోచన 91వ జయంతిని పురస్కరించుకుని నగరంలో శుక్రవారం 'అముదుమ్ తేనుమ్' పేరుతో మ్యూజిక్ షో జరుగనుంది. మైలాపూరులోని నెంబరు 109 లజ్ చర్చ్ రోడ్డులో ఉన్న ఏఎంఎస్ హాల్‌లో ఈ కార్యక్రమాన్ని ఎఫ్ఎంఎల్ఆర్, ఎన్‌జీఎల్ ట్రస్టులు సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ఈ కార్యక్రమం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమవుతుందని ఎఫ్ఎంఎల్ఆర్ ఛైర్‌పర్సన్ దేవి కృష్ణ, కోఛైర్ పర్సన్ మధుమిత రవి, ఎన్‌జీఎల్ ట్రస్ట్ కృష్ణ రౌతు గురువారం సంయుక్తంగా విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

కోవైలో ప్రివెంటివ్ హెల్త్ సెంటర్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

అడయార్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కోయంబత్తూరు, అరసూర్‌లో 'ఫ్రీడమ్ ఫ్రమ్ డిసీజ్'లో భాగంగా ఇండో స్టేట్ 'ప్రివెంటివ్ హెల్త్ సెంటర్' ప్రారంభించింది. 'వండర్ ఉమెన్ ఆఫ్ కోయంబత్తూరు', కమలాదళ్, ఇంటోస్టేట్ హెల్త్ యాప్ విజయలక్ష్మి, ఇండోస్టేట్ హెల్త్ ఫౌండర్, సీఈవో డాక్టర్ రాజేష్ రంగస్వామి, ఫౌండర్ డాక్టర్ నిత్యా మోహన్, వైద్యులు వాణి మోహన్, మోహన్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ లోకేష్, ఇండోస్టేట్ హెల్త్ మేనేజర్ అయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా అన్నాడీఎంకే

● ఏలగిరి సమావేశంలో ఈపీఎస్ హామీ



గిరిజనుల సమస్యలను తెలుసుకుంటున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ప్రాంతాల్లోని గిరిజనులకు అన్నాడీఎంకే అండగా ఉంటుందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంలో రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రచారయాత్ర చేస్తున్న ఈపీఎస్ గురువారం ఏలగిరిలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏలగిరి, కోటయూర్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన తెగలతో ఆయన సమావేశమయ్యారు. అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు రవాణా సౌకర్యంలేని గ్రామాలకు రోడ్డు వసతి కల్పిస్తామని, గిరిజనుల కోసం సంక్షేమ పథకాలు అమలుచేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కళాశాల విద్యార్థులను పలకరించిన ఈపీఎస్ వారితో సెల్ఫీ దిగారు. గిరిజనుల ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ, గిరిజనుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారికి శుద్ధిచేసిన తాగునీరు, విద్యుత్ దీపాల వసతి, పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తామని ఈపీఎస్ హామీ ఇచ్చారు.

తిరువళ్లూరు జిల్లా ఆవడిలో గురువారం ఉదయం ప్రధాని మోదీ పిలుపుమేరకు బీజేపీ రాష్ట్ర శాఖ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'ఇంటింటా త్రివర్ణ పతకం' యాత్ర నిర్వహిస్తున్న కేంద్రమంత్రి ఎల్.మురుగన్



తమిళం, ఆంగ్ల ప్రతిభా పరీక్షల్లో 7 లక్షల మంది 'ఫెయిల్'

ప్యారీస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 6 నుండి 9వ తరగతి వరకు తమిళం, ఆంగ్లం ప్రతిభా పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 7.29 లక్షల మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరికి ప్రాథమిక విద్య నేర్పించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. రాష్ట్రంలోని 38 జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 16లక్షల మంది విద్యార్థినీ, విద్యార్థులు 6 నుండి 9వ తరగతి చదువుతున్నారు. వీరిలో ప్రాథమిక విద్యపై అవగాహన లేని 8,02,214 మందికి సామర్థ్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. జూలై 8 నుండి 10వ తేదీ వరకు తమిళం, ఆంగ్ల, గణితం పాఠ్యాంశాలపై నిర్వహించిన ఈ పరీక్షా ఫలితాలు జూలై 25న విడుదల చేశారు.. ఇందులో 7,29,683 మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థుల సంఖ్యలో 45.35 శాతం మందికి ప్రాథమిక విద్య అంటే ఏమిటో కూడా తెలియలేదని స్పష్టమైంది. వారిలో కూడా అధికంగా నీలగిరి జిల్లాలో 6,322 మంది ఫెయిల్ అయ్యారు. పెరంబలూరు జిల్లా 10,781 మంది, తిరుచ్చి జిల్లాలో 21,806 మంది, చెన్నై జిల్లాలో 31,233 మంది ఫెయిలయ్యారు.

తిరుత్తణిలో ప్రారంభమైన

ఆడి కృత్తిక ఉత్సవాలు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

తిరుత్తణి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఆడి ఉత్సవాలు గురువారం ఉదయం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో పాల్గొనేందుకు లక్షలాదిమంది భక్తులు కావళ్లతో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ ఉత్సవాలు మంగళవారం వరకు జరగనున్నాయి. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రాతఃకాలార్చన, విశేష పూజలు చేశారు. ఈ వేడుకలకు పొరుగురాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు గురువారం వేకువజామున ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు వసతులు కల్పించేందుకు ఆలయ నిర్వాహకులు వారం రోజుల ముందు నుంచే చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం శరీరానికి శూలాలు గుచ్చుకున్న భక్తులు, వివిధ రకాల కావళ్లతో వచ్చిన భక్తులంతా చేరి ఆటపాటలతో సుబ్రహ్మణ్యస్వామి కీర్తిస్తూ నృత్యంలేసి సందడి చేశారు. ఎస్పీ వివేకానంద శుక్లా నేతృత్వంలో సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.



కావళ్లతో ఆలయానికి చేరుకున్న భక్తులు

బాంబు బెదిరింపులు..

చెంగల్పట్టు నివాసి అరెస్టు

చెన్నై, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సెయింట్ జార్జి కోటపై సీఎం స్టాలిన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించేటప్పుడు బాంబులు పేలనున్నాయని పోలీసు కంట్రోల్‌రూముకు ఫోన్ చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం రాత్రి పోలీసు కంట్రోల్‌రూమ్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేసి సెయింట్ జార్జికోట వద్ద బాంబులున్నాయని, పతాకావిష్కరణ సమయంలో పేలనున్నాయని తెలిపి ఫోన్ కట్ చేశారు. పోలీసులు వెంటనే కంట్రోల్ రూమ్‌లో నమోదైన సెల్‌ఫోన్ నెంబర్ ఆధారంగా బెదరించిన వ్యక్తి చెంగల్పట్టుకు చెందిన గణేష్‌గా గుర్తించి, అక్కడకు వెళ్ళి అతడిని అరెస్టు చేశారు. తాగిన మైకంలో బాంబు బెదరింపు చేసినట్లు గణేష్ తెలిపాడని పోలీసులు పేర్కొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో

ఐదేళ్లు జైలు

● రూ.ఆరు లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు ఇచ్చారు. నాగపట్ల ఈస్ట్ బీట్ చామలరేంజ్ పరిధిలో తమిళనాడు రాష్ట్రం తిరువన్నామలైకి చెందిన చిన్నస్వామి 2020వ సంవత్సరంలో అక్రమంగా ఎర్రచందనం తమిళనాడుకు తరలిస్తుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులు, అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి సాక్ష్యాధారాలు రుజువు కావడంతో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు రూ.ఆరు లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. నిందితుడిని నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు.

ఘనంగా కలవల కన్నన్ చెట్టి 105వ వర్ధంతి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న దృశ్యం

అడయార్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరామ్‌లోని డీఆర్‌బీసీసీసీ హిందూ కాలేజీలో కలవల కన్నన్ చెట్టి 105వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల కార్యదర్శి ఎం.వెంకటేశ పెరుమాళ్ ముఖ్య అతిథిగా, కళాశాల ప్రధాన అధ్యాపకురాలు డాక్టర్ జి.కల్వికరసి, సంచాలకులు డాక్టర్ ఎన్.రాజేంద్ర నాయుడు పాల్గొని కలవల కన్నన్ చెట్టి దంపతుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలుగు, తమిళం, హిందీ, ఆంగ్ల భాషల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి కార్యదర్శి చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేశారు. అలాగే సీతమ్మ ఫైన్‌ఆర్ట్స్ క్లబ్ తరఫున విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమం ఆహూతులను ఆకట్టుకుంది.

రేషన్ కార్డు నుంచి బస్ టిక్కెట్ల వరకు...

ఇక వాట్సాప్‌లో సర్కారు సేవలు

ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాతో కీలక ఒప్పందం

అడయార్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం ప్రజలకు అందించే సేవలను మరింత సులభతరం చేయనుంది. రేషన్ కార్డు నుంచి బస్ టిక్కెట్ల వరకు తొలి దశలో 50 సేవలను అందించనుంది. ఇందుకోసం ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటాతో ప్రభుత్వం ఒక కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. తమిళం, ఆంగ్ల భాషల్లో ఏఐ (కృత్రిమ మేధ) టెక్నాలజీతో వీటిని ప్రజల వద్దకు చేర్చనుంది. ఉదాహరణకు ఏదైనా ఒక సేవను పొందగోరువారు దానికి సంబంధించిన అన్ని రకాల ధ్రువ పత్రాలను వాట్సాప్‌లోనే అప్‌లోడ్ చేసి, వాట్సాప్‌లోనే ఆ సేవ రుసుం కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుంది. ఈ సేవలను వచ్చే మూడు నెలల్లో ప్రారంభించనున్నారు. గత ఏప్రిల్‌లో అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర మంత్రి పళనివేల్ త్యాగరాజన్ ఈ విషయానిన వెల్లడించారు. ఆ ప్రకారంగానే ఇపుడు ఈ సేవలను అందుబాటులోకి తీసుకుని వచ్చేందుకు వీలుగా మెటాతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. సెక్యూరిటీ పరంగా ఓటీపీతో పాటు మరికొన్ని భద్రతా ప్రమాణాలను పాటించనున్నారు. రేషన్ కార్డు, జనన మరణ ధ్రువీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు, వాణిజ్య అనుమతులు పొందడం, బస్సు టిక్కెట్ రిజర్వేషన్, రేషన్ కార్డుల్లో చిరునామా మార్పు, ఆదాయం, ఫస్ట్‌గ్రేడ్ డిగ్రీ సర్టిఫికెట్, మెట్రో వాటర్, ఆస్తి పన్ను చెల్లింపులు, డ్రైనేజీ పన్ను చెల్లింపు, రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్ల తొలగింపు, చేరిక ఇలా సుమారుగా 50 సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఆ తర్వాత మరికొన్ని సేవలు తీసుకొచ్చేలా తమిళనాడు ఆన్‌లైన్ సేవల విభాగం దృష్టిసారించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ-సేవా కేంద్రాల ద్వారా లభించే 35843 సేవలను వాట్సాప్‌లోనే అందించేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ కొత్త ప్రయత్నం వల్ల ప్రభుత్వం సేవలను ప్రజలు మరింత సులభంగా పొందే అవకాశం ఉంటుంది. వాట్సాప్‌లో ఏ సమయంలోనైనా, ఎలాంటి సేవనైనా సులభంగా పొందే అవకాశం ఉంది.